


రాంపుల్లయ్య యాదవ్ | డాక్టర్ ప్రసాద్ | డాక్టర్ చంద్రశేఖర్ | బత్తిని లక్ష్మీనారాయణ | నాగరాజు యాదవ్




రేసులో 9 మంది

రాష్ట్రంలో అధికార వైసీపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ఇటీవలి కాలంలో ప్రజల్లో జగన్ గ్రాఫ్ దారుణంగా పడిపోయింది. గెలుస్తామో? ఓడిపోతామోనన్న భయం, టెన్షన్ ఆ పార్టీని వెంటాడుతోంది. ఇదే సమయంలో టీడీపీ-జనసేన కూటమికి ప్రజాదరణ అమాంతంగా పెరిగింది. ఈ క్రమంలో వైసీపీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు జంకుతుండగా టీడీపీ నుంచి ఆశావహుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటికే కర్నూలు పార్లమెంట్ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా ప్రకటించిన మంత్రి గుమ్మనూరు జయరాం వెనకడుగు వేశారు. వైసీపీ నుంచి పోటీ చేస్తే ఓటమి ఖాయం అని ఆయన భావించారు. అందుకే ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు. దీంతో డోలాయమానంలో పడ్డ వైసీపీ కర్నూలు ఎంపీ స్థానానికి మరొకరిని ఎంపిక చేసుకోవాల్సిన పరిస్థితి అనివార్యమైంది. ఇక ఊపు మీదున్న టీడీపీ విషయానికొస్తే కర్నూలు ఎంపీ టికెట్‌కు డిమాండ్ ఏర్పడింది. ఈ స్థానానికి ఏకంగా 9 మంది టికెట్‌ను ఆశిస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ నాయకత్వం ఎంపీ టికెట్‌పై తుది కసరత్తు పూర్తి చేసింది.

- టీడీపీ ఎంపీ టికెట్‌పై ఉత్కంఠ!
- ఆశావహులందరూ ఉన్నత విద్యావంతులే
- భానుశంకర్, బస్తిపాడు నాగరాజుపై టీడీపీ ఫోకస్
- నాలుగైదు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం

కర్నూలు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థిపై ఉత్కంఠ నెలకొంది. రేసులో పలువురు ఆశావహులు పోటాపోటీగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ టికెట్ బీసీలకు ఇవ్వాలని టీడీపీ భావించడంతో ఆ సామాజికవర్గానికి చెందిన పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. నాలుగైదు రోజుల్లో రెండో జాబితాతో పాటు కర్నూలు ఎంపీ అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది. దీంతో టికెట్ కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల గురించి వివిధ అంశాలపై రెండు మూడు దఫాలుగా సర్వేలు చేసింది. చంద్రబాబు తుది కసరత్తు చేస్తున్నారు. కర్నూలు టీడీపీ అభ్యర్థి ఎవరు..? అనే చర్చ జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతోంది.



● తొమ్మిది మంది ఆశావహులు


కర్నూలు టీడీపీ ఎంపీ టికెట్ రేసులో తొమ్మిది ఆశావహులు ఉన్నారు. వారంతా డాక్టర్లు, ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్.. వంటి ఉన్నత విద్యావంతులు కావడం విశేషం. కర్నూలు మండలం పంచలింగాల ఎంపీటీసీ సభ్యుడు, టీడీపీ బీసీ సాధికారిత రాష్ట్ర కమిటీ సభ్యుడు బస్తిపాడు నాగరాజు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అదేవిధంగా హర్యానా రాష్ట్ర గవర్నర్ వద్ద ఓఎస్డీగా పని చేస్తున్న ఐటీ నిపుణుడు బీపీ భానుశంకర్ తాజాగా టికెట్ రేసులోకి వచ్చారు. దీంతో ఈ ఇద్దరిపై టీడీపీ అధిష్టానం ఫోకస్ పెట్టింది. వారి వివరాలు, వారి బలాబలాలు, గెలుపు అంశాలపై ఇప్పటికే టీడీపీ అంతర్గత సర్వే కూడా చేపట్టింది. వీరి తర్వాత టీడీపీ సీనియర్ నాయకులు లక్కీటూ బ్రదర్స్‌లో ఒకరైన రాంపుల్లయ్య యాదవ్, ఆదోనికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బత్తిన లక్ష్మీనారాయణ, టికెట్ దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అదేవిధంగా టీడీపీ కర్నూలు నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, అమిలీయో ఆస్పత్రి అధినేత డాక్టర్ ప్రసాద్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లాకు చెందిన సత్యం వెంచర్స్ ఇంజనీరింగ్ సర్వీసెస్ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజరు ఎంకే రాజశేఖర్, ఢిల్లీ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పత్తికొండ కురువ పరమేశ్ ఎవరికివారుగా ప్రయత్నిస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ టీడీపీ నుంచి స్పష్టమైన హామీ వస్తే ఆ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.




బీపీ భానుశంకర్ | పంచలింగాల నాగరాజు

సర్వేల ఆధారంగా అభ్యర్థి ఎంపిక

ఎంపీ టికెట్ ఆశిస్తూ ఆశావహులు నుంచి తొమ్మిది దరఖాస్తులను వివిధ దశల్లో టీడీపీ అధినేత చంద్రబాబు గెలుపు అవకాశాలు, రాజకీయ, సామాజిక సమీకరణాలు, జిల్లాలో వారికి ఉన్న సంబంధాలు, బంధువర్గం.. వంటి అంశాలపై మూడు నాలుగు సెగ్మెంట్లలో సర్వేలు చేయించినట్లు తెలిసింది. అంతేకాకుండా నియోజకవర్గం నుంచి జిల్లా స్థాయి వరకు పలువురు నాయకులు, ముఖ్యకార్యకర్తలు అభిప్రాయాలను సేకరించారు. ఇటీవల భానుశంకర్ చంద్రబాబును కలిశారు. అదేవిధంగా రెండు రోజుల క్రిత పంచలింగాలకు చెందిన బస్తిపాడు నాగరాజు కూడా చంద్రబాబును అమరావతిలో కలిశారు. పంచలింగాలకు చెందిన బస్తిపాడు నాగరాజు, భానుశంకర్ పేర్లు తుది దశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రెండు మూడు రోజుల్లో టీడీపీ ఎంపీ టికెట్ ఎవరికి దక్కనుందో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



అశేష జనవాహిని మధ్య ఊరేగుతున్న రేణుకా ఎల్లమ్మ రథోత్సవం

జనసంద్రమైన కోసిగి

కన్నులపండువగా ఎల్లమ్మ రథోత్సవం



కోసిగి, ఫిబ్రవరి 29: కోసిగి రేణుకా ఎల్లమ్మ రథోత్సవం గురువారం కన్నులపండువగా సాగింది. అమ్మవారి వేడుకలకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో కోసిగి మండల కేంద్రం జనసంద్రంగా మారింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని నైవేద్యంగా కుడుములు, గుగ్గిళ్లు, ఉప్పు, కల్లు, చీర, రవిక కుంభాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదో.. ఉదో తాయీ రేణుకా ఎల్లమ్మ అంటూ భక్తులు భక్తిపారవశ్యంతో పరవశించిపోయారు. ఆలయ పూజారులు ఉమేష్‌గౌడు, మల్లయ్యగౌడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం దొరల చావిడి శ్రీనివాస్, గ్రామ పెద్దలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. రథోత్సవ వేడుకల్లో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి, ఆయన తనయుడు పాలకుర్తి దివాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు ప్రదీప్ రెడ్డి, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్‌కుమార్ పోలీసు బందోబస్తు పర్యవేక్షించారు.


రేణుకా ఎల్లమ్మ రథోత్సవంలో పాల్గొన్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, తనయుడు దివాకర్ రెడ్డి

జగన్నాథగట్టుపై జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 29: జగన్నాథగట్టుపై నిర్మించనున్న జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మార్చి 4న శంకుస్థాపన చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. గురువారం ఎస్పీ జి. కృష్ణకాంత్, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజతో కలిసి జేసీ జగన్నాథగట్టుపై హెలిప్యాడ్, వేదిక స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, డీఎస్పీ విజయకుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఈఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై చిన్నచూపు చూస్తున్న జగన్

● రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు ● కర్నూలులో సింహగర్జన సభ

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 29: విభిన్న ప్రతిభావంతుల పట్ల వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దివ్యాంగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆరోపించారు. గురువారం కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో వికలాంగుల జేఏసీ ఆధ్వర్యంలో వికలాంగుల సింహగర్జన సభను నిర్వహించారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ అకాల మరణానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విభిన్న ప్రతిభావంతులపట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఏ రంగంలోనూ వికలాంగులకు న్యాయం చేయడంలేదని అన్నారు. చంద్రబాబు నాయుడు పెంచిన రూ. 3 వేల పింఛన్ తప్ప ఈ ప్రభుత్వం ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేసిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం ఓట్లు వేయించుకోడానికి అనేక హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ. 3 వేలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో చంద్రబాబు వికలాంగులకు మోటర్ బైకులు, వివాహ ప్రోత్సాహకాభివృద్ధికి రూ. లక్ష ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం కళ్లు తెరిచి విభిన్న ప్రతిభావంతుల పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచాలన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ఇంటి స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఆర్థిక రుణాలు అందించాలని, బ్యాక్ లాగ్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం దక్షిణాది రాష్ట్రాల నాయకుడు శ్రీనివాసులు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అన్ని రకాలుగా దివ్యాంగులను మోసం చేసిందని అన్నారు. జేఏసీ అధ్యక్షుడు బీసీ నాగరాజు, కడప, అనంతపురం, గుంటూరు జిల్లాల నాయకులు దుర్గారావు, వీరారెడ్డి, శ్రీనివాసులు, జేఏసీ కోశాధికారి వీరన్న తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

'జెండా' సభతో ప్యాలెస్ దద్దరిల్లింది

- టీడీపీ, జనసేన పొత్తు సూపర్ హిట్
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు


మాట్లాడుతున్న జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు

మద్దికెర, ఫిబ్రవరి 29: టీడీపీ, జనసేన పొత్తుతో తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభ చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని.. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. ఇటీవల వైసీపీ దాడికి గురైన ఆంధ్రజ్యోతి విలేకరి కె. వీరశేఖర్‌ను గురువారం మద్దికెర గ్రామంలో ఆయన స్వగృహంలో బీటీ నాయుడు పరామర్శించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, వివిధ వర్గాల భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన కలిశాయని, ఈ పొత్తు సూపర్ హిట్ అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పులివెందులలో కూడా జగన్ ఓటమి తథ్యమని అన్నారు. టీడీపీ, జనసేన కలవడంతో వైసీపీకి అంతుపట్టడం లేదని అన్నారు. ఈ సమావేశంలో తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ చికెన్ రవి, మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

లీపు శిశువులు



కోసిగి, ఫిబ్రవరి 29: నిజానికి ఫిబ్రవరి 29న పిల్లలను జన్మనివ్వాలని ఏ తల్లి అనుకోదు. ఎందుకంటే పుట్టిన రోజు నాలుగేళ్లకు వస్తుందని ఫీల్ అవుతుంటారు. అయితే ఈ లీపు సంవత్సరంలో కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిబ్రవరి 29న నలుగురు శిశువులు జన్మించారు. ఫిబ్రవరి నెలలో 28 రోజులు మాత్రమే ఉంటాయి.. కానీ నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఫిబ్రవరి నెలలో 29 రోజులు వస్తాయి.. అందుకే ఈ తేదీని లీపు ఇయర్ అంటారు. ఈ అరుదైన రోజున కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో నలుగురు తల్లులు శిశువులకు జన్మనిచ్చారు. వీరిలో ముగ్గురు ఆడ శిశువులు, ఒక మగ శిశువు ఉన్నారు. కోసిగి ఆసుపత్రి డాక్టర్ రజిత, సిబ్బంది రాఘవేంద్ర డెలివరీ చేయించారు. స్పెషల్ డే రోజున పుట్టిన ఈ చిన్నారుల పుట్టిన రోజు వేడుకలు నాలుగేళ్లకు ఒకసారి జరుపుకోవాల్సిందే.



లీప్ ఇయర్ బేబీస్‌తో డాక్టర్ రజిత, ఆసుపత్రి సిబ్బంది రాఘవేంద్ర



లీపు ఇయర్ రోజున పుట్టిన నలుగురు పిల్లలు వీరే...

- కోసిగి ఆసుపత్రిలో నలుగురు జననం
- అరుదైన రోజు ఫిబ్రవరి 29న పుట్టిన పిల్లలు

ఆరుగురు అమ్మాయిల తర్వాత మగబిడ్డ

కోసిగి మండల పరిధిలోని ఆర్లబండ గ్రామానికి చెందిన రామయ్య, మహాదేవి దంపతులకు వరుసగా ఆరు కాన్పుల్లో ఆడపిల్లలు జన్మించారు. మగ పిల్లాడి కోసం వారు ఎంతగానో వేచి చూశారు. ఏడో కాన్పులో, అందులోనూ లీపు సంవత్సరం, ఫిబ్రవరి 29న మగ శిశువును మహాదేవి జన్మనిచ్చింది. అయితే ఒక్కగానొక్క కుమారుడి పుట్టినరోజు వేడుకలు నాలుగేళ్లకు జరుపుకోవాలని, ఓ వైపు బాధగా ఉన్నా.. అరుదైన రోజు కుమారుడు జన్మించాడని సంతోషంగా ఉందని మహాదేవి ఆనందం వ్యక్తం చేసింది.



మరింత తగ్గిన వేరుశనగకాయల ధర

- క్వింటా గరిష్ఠంగా రూ. 6,492
- మరో రూ.3 వేలు తగ్గిన వాము



రైతులు విక్రయానికి తెచ్చిన వేరుశనగ కాయలు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 29: కర్నూలు మార్కెట్ యార్డులో వివిధ పంట ఉత్పత్తుల ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటానికి వేరుశనగ కాయలు గరిష్ఠ ధర రూ.6,942, మధ్యస్థ ధర రూ.5,610, కనిష్ఠ ధర రూ.4,010 మాత్రమే పలకడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా వారం కింద వాము ధర గరిష్ఠంగా రూ.30వేలు ఉండేది. గురువారం రూ.3వేలు తగ్గిపోయి, గరిష్ఠ ధర రూ.27,100, మధ్యస్థ ధర రూ.14,333, కనిష్ఠ ధర కేవలం రూ.607కు పడిపోయింది. మొక్కజొన్నల ధర క్వింటానికి గరిష్ఠ, మధ్యస్థ ధరలు రూ.2,169కు చేరగా.. కనిష్ఠ ధర రూ.1,869కు పడిపోయింది. కందులకు గరిష్ఠ ధర రూ.9,829, మధ్యస్థ ధర రూ.8,911, కనిష్ఠ ధర రూ.1,609కు తగ్గిపోయింది. శనగలకు గరిష్ఠ ధర రూ.5,919, మధ్యస్థ ధర రూ.5,909, కనిష్ఠ ధర రూ.3,010కు పడిపోయింది. ఉల్లిగడ్డలకు గరిష్ఠ ధర రూ.1,654, మధ్యస్థ ధర రూ.1,644, కనిష్ఠ ధర రూ.309కు చేరింది. ఎండు మిరపకాయలకు గరిష్ఠ ధర రూ.20,399, మధ్యస్థ ధర రూ.15,959, కనిష్ఠ ధర రూ.1,000కు పడిపోయింది. కొర్రలు గరిష్ఠ ధర రూ.4,039, మధ్యస్థ ధర రూ.4,029, కనిష్ఠ ధర రూ.3,209కు తగ్గింది. మినుముల ధర గరిష్ఠ, మధ్యస్థ ధర రూ.9,171లు, కనిష్ఠ ధర రూ.7,011కు తగ్గింది.

వ్యాపారులకు హెచ్చరిక: కర్నూలు మార్కెట్ యార్డుకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాలు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి రైతులు ఎంతో నమ్మకంతో పంట ఉత్పత్తులను అమ్మకానికి తెస్తున్నారని, వారి ఆశలను వమ్ము చేయకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరను అందించేందుకు వ్యాపారులు చర్యలు తీసుకోవాలని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు తెలిపారు. తూకాల్లో ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా ఉండాలని, జీరో వ్యాపారాన్ని ఎవరైనా ప్రోత్సహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సెక్రటరీ గోవిందు హెచ్చరించారు.

కేఎంసీ ప్రిన్సిపాల్‌గా చిట్టి నరసమ్మ



సుధాకర్ నుంచి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకుంటున్న చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 29: కర్నూలు మెడికల్ కాలేజీ 39వ కొత్త ప్రిన్సిపాల్‌గా డా. చిట్టి నరసమ్మ బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాల్ డా.పి.సుధాకర్ గురువారం పదవి విరమణ పొందడంతో ఆయన నుంచి సాయంత్రం డా. చిట్టి నరసమ్మ బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు మెడికల్ కాలేజీలో 1985-90లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఆమె 1985-98 వరకు అనటామి పీజీ చేసి 1998 అనాటమి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2003లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2008లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2004లో కర్నూలు నుండి అనంతపురానికి బదిలీ అయ్యారు. తిరిగి 2017లో కర్నూలుకు వచ్చారు. 2019 నుంచి వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. 2024 ఫిబ్రవరి 29న ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన వెంకప్ప, చిన్నమ్మ దంపతుల 8వ సంతానం ఈమె. భర్త పేరు నాగరాజు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు శిరీష, ఆమని, శ్రావణి. ఇద్దరు ఎంబీఏ, ఒకరు ఎంటెక్ చదివారు.

సమాజానికి ఉపయోగపడే రచనలు అవసరం

క్లస్టర్ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, కళాశాల అధ్యాపకులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 29: సమాజానికి మేలు చేసే రచనలు నేడు అవసరమని, ఆ దిశగా కర్నూలుకు చెందిన చారిత్రక పరిశోధక నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని క్లస్టర్ విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని బి.క్యాంపులోగల సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల్లో, క్లస్టర్ వర్శిటీ ఆధ్వర్యంలో అజీజ్ రాసిన 'వింధ్య' (రేడియో నాటకాల సంపుటి) పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆచార్య సాయిగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాభిలాషను పెంచుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ సాహిత్యం వల్ల సమాజంలోని మంచి చెడులను గుర్తించే అవకాశం ఉందని, విద్యార్థులు సాహిత్య పుస్తకాలు చదవాలని సూచించారు. ప్రత్యేక ఆహ్వానితుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ఉర్దూ వర్శిటీ ఆచార్యుడు మహబూబ్ బాషా, సిల్వర్ జూబ్లీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ చరిత్రకు సంబంధించిన విషయాలతోపాటు సాంఘిక రచనలు చేస్తున్న అజీజ్ రచనలు నేటి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సమావేశంలో రచయిత అజీజ్‌తోపాటూ అడపా శ్రీ సత్య, కళాశాల అధ్యాపకులు పాల్గొని ప్రసంగించారు.

పాడిపశువుల పెంపకానికి రుణాలు: జేడీ

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 29: రైతులకు పాడిపశువుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు ఇస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య కోరారు. గురువారం ఆయన నగరంలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పశుకిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రైతులకు, కౌలు రైతులకు పదిహేను రోజుల్లో రుణాలను మంజూరు చేయించేందుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ద్వారా చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



- శ్రీగిరిపై నేటి నుంచి మహాశివరాత్రి వేడుకలు
- స్వామివారి అలంకార దర్శనం మాత్రమే
- శివమాలధారులకు 5 వరకు స్పర్శదర్శనం
- ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

శ్రీశైలం, ఫిబ్రవరి 29: శ్రీశైలం మహక్షేత్రంలో శుక్రవారం నుంచి 11వ తేదీ వరకు మహశివరాత్రి బ్రహ్మోత్సవాలను దేవస్థానం వైభవంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా గురువారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఏఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఉత్సవాల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ ఈఓ డి.పెద్దిరాజు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ప్రతి శాఖతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆరా తీశారు. పాదయాత్రగా అటవీ మార్గంలో శ్రీశైలం దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేకంగా తాగునీరు, అన్నదానం, సేదతీరేందుకు చలువ పందిళ్లు తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. అటవీమార్గంలో 13 చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, అవసరమైన మందులను అందుబాటులో ఉంచినట్లు వైద్యాధికారులు వెల్లడించారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు మంచినీరు, అల్పాహారం అందజేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద ఎక్కువ సమయం వేచివుండకుండా ప్రత్యేక చర్యలను చేపట్టాలన్నారు. అటవీశాఖ పరిధిలో ఉన్న చెక్‌పోస్టుల్లో మార్చి 1 నుంచి 11 వరకు ఎలాంటి రుసుం తీసుకోకుండా వాహనాలను అనుమతించాలని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌ను జేసీ ఆదేశించారు. హఠకేశ్వరం వద్ద రోడ్డుకు ఉన్న దుకాణాలను మార్పు చేయాలని ఆదేశించారు. సమావేశం అనంతరం జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రపరిధిలోని టోల్‌గేట్, వలయదారి, యజ్ఞవాటిక, పార్కింగ్ ప్రదేశాలు, మల్లమ్మ కన్నీరు ప్రాంతం, క్యూలైన్లు తదితర వాటిని పరిశీలించి తగు సూజనలను జారీ చేశారు.

- బ్రహ్మోత్సవాల్లో అన్ని ఆర్జిత సేవలను నిలుపుదల చేశారు. ఒకటో తేదీ నుంచి 5వ తేదీ రాత్రి 7:30 వరకు శివమాలధారులకు మాత్రమే శివలింగ స్పర్శదర్శనం కల్పించనున్నారు.
- ఉత్సవ రోజుల్లో 5 నుంచి 11 వతేదీ వరకు ప్రముఖులకు మూడు విడతలుగా విరామ దర్శనం వేళల్లో మాత్రమే దర్శనం కల్పిస్తారు. ఉదయం 6:30 నుంచి 7:30 వరకు, మధ్యాహ్నం 12:30 నుంచి ఒంటి గంట వరకు, సాయంత్రం 7 నుంచి 7:30 గంటల వరకు వీఐపీలకు దర్శనం ఉంటుంది.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్

నందికొట్కూరు వైసీపీలో అంతర్గత ఘర్షణలు



లక్ష్మీచెన్నకేశవ ఆంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

ఎమ్మెల్యే అనుచరుడిపై సిద్ధార్థరెడ్డి వర్గీయుల దాడి..?

నంద్యాల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గం వైసీపీలో వర్గ విభేదాలు తారా స్థాయికి చేరుతున్నాయి. ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ వర్గం నినాదాలు చేస్తే సిద్ధార్థరెడ్డి వర్గం దాడి చేసినట్లు తెలుస్తోంది. గురువారం పగిడ్యాల మండలం లక్ష్మాపురంలో లక్ష్మీచెన్నకేశవ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ముందుగా ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ పూజలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో స్వామివారి దర్శనానికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, నియోకవర్గ సమన్వయకర్త దార సుధీర్ వెళ్లారు. ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ పూజ నిర్వహించుకుని బయటకు వెళ్తున్న సమయంలో ఆర్థర్ జిందాబాద్, ఆర్థర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ వైసీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సగినెల రమణ నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి అనుచరులు నినాదాలు చేయకుండా వెళ్లాలని సూచించారు. అయితే వారు అలాగే నినాదాలు కొనసాగించడంతో సిద్ధార్థరెడ్డి అనుచరులు సగినెల రమణపై దాడి చేసినట్లు తెలుస్తోంది. గుడిలో నినాదాలు, జిందాబాద్‌లు ఏమిటని పరస్పరం విమర్శలు చేసుకున్నారు. అయితే ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గాల మధ్య విభేదాలు ఉన్నాయని తెలిసి కూడా పోలీసులు ఒకరు పూజ చేస్తుండగా మరొకరిని గుడిలోకి పంపడం వల్లే ఘర్షణ జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనలో పోలీసులు వ్యవహరించిన తీరుపై, సిద్ధార్థరెడ్డి వర్గంపై ఫోన్లో ఎస్పీకి ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ ఫిర్యాదు చేశారు.

నంద్యాల ఆస్పత్రిలో చోరీకి విఫలయత్నం

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 29 : నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బుధవారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని దొంగ చోరీకి విఫలయత్నం చేశాడని పోలీసులు గురువారం తెలిపారు. నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సత్వర చికిత్స విభాగంలో గుర్తు తెలియని దొంగ బాత్‌రూమ్ కిటికీని తొలగించి లోపలికి వచ్చేందుకు ప్రయత్నించాడు. అయితే బాత్‌రూమ్ డోర్‌కు అవతలి వైపు నుండి గడియ పెట్టి ఉండటంతో దొంగ ప్రయత్నం ఫలించలేదు. చేసేదిలేక సదరు దొంగ వచ్చినదారినే వెళ్లిపోయాడు. ఒకవేళ దొంగ ప్రయత్నం ఫలించి ఉంటే పెద్ద ఎత్తున నష్టం జరిగి ఉండేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఈ విభాగంలో సుమారు రెండుకోట్ల రూపాయల విలువచేసే ఆధునిక యంత్రాలు, మరికొన్ని మెడికల్ పరికరాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- నిమిషం ఆలస్యమైతే నో ఎంట్రీ
- హాజరు కానున్న 47,412 మంది
- 69 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కర్నూలు జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటు ఆఫీసర్లకు, కస్టోడియన్లకు పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శిక్షణలు ఇచ్చారు. మార్చి 1న ఇంటర్ ప్రథమ సంవత్సరం, 2వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలకు 47,412 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరంలో 22,239 మంది, ద్వితీయ సంవత్సరంలో 25,173 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 69 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. ప్రతిరోజు పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరగనుంది. అరగంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షలకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు టోల్‌ఫ్రీ.నెంబర్08518-222047ను సంప్రదించాలని అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలకు 69 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 69మంది డిపార్టుమెంటు ఆఫీసర్స్, 1650 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొంటున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌తో అనుసంధానం చేశారు. గురువారం కర్నూలు ప్రభుత్వ టౌన్‌మోడల్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆర్‌ఐవో గురువయ్యశెట్టి పరిశీలించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అలాగే జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



టౌన్ మోడల్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి

కోడుమూరు కోటపై టీడీపీ జెండా ఎగరేస్తాం



వృద్ధురాలితో మాట్లాడుతున్న బొగ్గుల దస్తగిరి

గూడూరు, ఫిబ్రవరి 29: కోడుమూరు కోటపై టీడీపీ జెండా ఎగుర వేసి చంద్రబాబుకు కానుకగా ఇస్తామని టీడీపీ కోడుమూరు అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం ఆయన మండలంలోని కె నాగలాపురం గ్రామంలో పర్యటించారు. ఆయనకు టీడీపీ సర్పంచ్ జె నయోమి, టీడీపీ మాజీ మండల కన్వీనర్ జె సురేష్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బొగ్గుల దస్తగిరి ఇంటింటికీ వెళ్ళి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ అరాచక పాలనను అంతం చేసి చంద్రబాబును సీఎం చేయాలని అప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జె.సురేష్, కె.నాగలాపురం సర్పంచ్ జె.నయోమి, గోపాల్ రెడ్డి, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పౌలు, సృజన్, కె.కృష్ణ, కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, రవి, గుడిపాడు మహేశ్వర రెడ్డి, నాగ సుంకన్న, నాగులు, తిరుపాలు, అయ్యన్న, గిడ్డయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీటు కోసం దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న వెంకట సుజాత

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 29: కర్నూలు కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని జిల్లా సేవాదళ్ అధ్యక్షురాలు వెంకట సుజాత అన్నారు. గురువారం విజయవాడలోని ఆంధ్ర రత్న భవన్‌లో దరఖాస్తు అందజేశారు. చివరి రోజు జిల్లా నుంచి పోటీలో నిలిచేందుకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఆమె ఉన్నారు.

బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి

కర్నూలు(న్యూసిటీ)/కల్లూరు, ఫిబ్రవరి 29: సుందరయ్య నగర్‌లో ఈనెల 27న జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు రూ.5లక్షల నష్టపరిహా రం చెల్లించాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు సుధాకరప్ప డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం బృందం ప్రమాదానికి గురైన కొట్టాలను పరిశీ లించారు. ఈ సందర్భంగా సుధాకరప్ప మాట్లాడుతూ ఇంట్లో ఉన్న సరుకులు, బియ్యం, నగదు, డబ్బులు రెవెన్యూ పట్టా కాగితాలు మొత్తం అగ్నికి ఆహుతి అయ్యాయని అన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, దావీదు, ఎస్. ముక్తార్ పాల్గొన్నారు.

సమాజ్‌వాది పార్టీ నగర అధ్యక్షుడిగా అబ్దుల్ నబిసా

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 29: సమాజ్‌వాది పార్టీ నగర అధ్యక్షుడిగా అబ్దుల్ నబిసాను నియమించారు. గురువారం బిర్లా కాంపౌండ్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జే.శ్రీనివాసుడు నాయుడు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నబిసా మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు అయ్యన్నయాదవ్, శ్రీనివాసులు, సి.మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కర్నూలు (న్యూసిటీ), ఫిబ్రవరి 29: సీఆర్ సేవా సమితి, శాంతిరాం ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నగరంలోని గీతాముఖర్జీనగర్‌లో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 100 మందికి పైగా పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సమితి జిల్లా కే.జగన్నాథం మాట్లాడుతూ కంటికి సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు తక్కువ ధరకే ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమితి కార్యవర్గ సభ్యుడు శివప్రసాద్, శాంతిరాం వైద్యులు వెంకటసాయి, సురేష్, మధు, సాయి పాల్గొన్నారు.

పెండింగ్ జీతాల పంపిణీ

కర్నూలు (న్యూసిటీ), ఫిబ్రవరి 29: నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లకు పెండింగ్ జీతాలు పంపిణీ చేశారు. గురువారం కార్యాలయంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి డ్రైవర్లకు జీతాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం జులై నుంచి అక్టోబరు వరకు జీతాల తోపాటు అరియర్స్ కూడా చెల్లించామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, రమేష్‌బాబు, జిలానీ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత



బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న గౌరు దంపతులు

కల్లూరు, ఫిబ్రవరి 29: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ విజయబావుటా ఎగరేసి అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 19వ వార్డు శ్రీవారి కుటీర్‌లో ఆమె బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని ఎన్నికల మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ వైసీపీ 58 నెలల పాలనలో ప్రజలు విసిగివేసారి పోయా రని అన్నారు. ఉద్యోగులకు సీపీఎస్ రద్దు, ఏపీకి ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, సంపూర్ణ మద్యపాన నిషేధం వంటి హామీలను అమలు చేయడంలో జగన్‌రెడ్డి ఘోరంగా విఫలం అయ్యారని విమర్శించారు. చంద్రబాబు ప్రజల కోసం ఆరు నూతన పథకాలను ప్రవేశపెట్టారని అన్నివర్గాలకు మేలు చేయడా నికి అహర్నిశలు కష్టపడుతున్న చంద్రబాబును రానున్న ఎన్నికల్లో గెలి పించుకుని సీఎం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీ నర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, వార్డు ఇన్‌చార్జి ప్రభాకర్‌యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, వంగాల జనార్దన్‌రెడ్డి, వీరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **తాడేపల్లి సభతో వైసీపీకి భయం:** తాడేపల్లిసభతో అధికార వైసీపీకి భయం పట్టుకుందని టీడీపీ, జనసేన సభ సూపర్‌హిట్ అయిందని గౌరుచరిత అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా 5కోట్ల ప్రజల కోసం పొత్తుపెట్టుకున్నామని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని గౌరు చరిత పిలుపునిచ్చారు.

గాడిచర్ల జీవితం నేటి తరాలకు ఆదర్శప్రాయం

క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్



గాడిచర్ల హరిసర్వోత్తమరావు, రమాబాయి, ముచ్చుకోట లక్ష్మీదేవి చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న క్లస్టర్ వర్సిటీ వీసీ తదితరులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 29: స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జీవితం నేటి తరాలకు ఆదర్శప్రాయమని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల్లో గాడిచర్ల 64వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా గాడిచర్ల హరిసర్వోత్తమరావు, గ్రంథాలయ ఉద్యమకారుడు ముచ్చుకోట వెంకట్రామయ్య సతీమణి ముచ్చుకోట లక్ష్మీదేవి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య సాయిగోపాల్ మాట్లాడుతూ హరిసర్వోత్తమరావు గ్రంథాలయాల పురోభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఎందరో మహిళలు తమ సంతానాన్ని గొప్పగా తీర్చిదిద్దడమే కాకుండా భర్తల వెంట ఉద్యమ బాటలో నడిచారని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో రాష్ట్రంలో తొలి రాజకీయ ఖైదీ గాడిచర్ల అని, రాజకీయ, సాహిత్య రంగాలకు ఆయన చేసిన కృషి స్మరణీయమని అన్నారు. ఈసభలో గాడిచర్ల సతీమణి గాడిచర్ల రమాబాయి, ముచ్చుకోట సతీమణి ముచ్చుకోట లక్ష్మీదేవమ్మలపై ఏర్పాటు చేసిన స్మారకోపన్యాసంలో హైదరాబాదు మౌలానా జాతీయ ఉర్దూ వర్సిటీ ఆచార్యుడు షేక్ మహబూబ్ బాషా ముఖ్యవక్తగా ప్రసంగించారు. నరసం జిల్లా కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి సమన్వయకర్తగా వ్యవహరించారు. సభలో ముచ్చుకోట వెంకట్రామయ్య కుమారుడు చంద్రశేఖర్, సాహితీవేత్తలు జేఎస్ఆర్‌కే శర్మ, విశ్రాంత ఆచార్యులు వైవీ రమణయ్య, విశ్రాంత సైనిక అధికారి కేసీ రాముడు, జి.రంగనాథ్, జయసుశీల, రాధారాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇళ్ల పేరుతో పేదల్ని అప్పుల పాలుచేసిన జగన్ రెడ్డి

టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 29: ఇళ్ల పేరుతో పేదల్ని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అప్పులపాల్జేశారని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాదికి రూ.5 లక్షల చొప్పున మొత్తం 25 లక్షల ఇళ్లు నిర్మించి ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని అన్నారు. ఇళ్ల పేరుతో ఒక్కో డ్వాక్రా మహిళకు రూ.35వేల చొప్పున మొత్తం 3.866 కోట్లు అప్పు మోపారని అన్నారు. టిడ్కో ఇళ్లను తాకట్టు పెట్టి రూ.10వేల కోట్లు అప్పులు తీసుకురావడం దారుణమన్నారు. ఓటీఎస్ పేరుతో ఎన్టీఆర్, చంద్రబాబు ఉచితంగా ఇచ్చిన ఇళ్లకు బలవంతంగా రూ.10 వేల నుంచి రూ.30వేలు జగన్ రెడ్డి వసూలు చేశారన్నారు. భారతి సిమెంటులో బూడిద కలిపి కట్టిన ఇళ్లు కూలిపోతున్నాయని అన్నారు. చంద్రబాబు హయాంలో ఐదేళ్లలో 12 లక్షల నాణ్యమైన ఇళ్లు కట్టగా.. జగన్ హయాంలో పది శాతం ఇళ్లు కూడా పూర్తి చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా, కేవీ మధు, తదితరులు ఉన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం తెస్తాం

సి.బెళగల్, ఫిబ్రవరి 29: టీడీపీకి పూర్వవైభవం తెస్తామని సి.బెళగల్ హమాలీ యూనియన్ నాయకుడు భీమన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యకర్తలంతా కలిసి కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరికి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు భీమన్న, వెంకప్ప, దేవన్నలు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలలో టీడీపీని గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు. షడ్రక్, మహేంద్ర, మోజెస్, లాజర్, లాబాను, సోమన్న, జీవరత్నం, సుధాకర్, శంకర్, సుంకన్న పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

సి.బెళగల్, ఫిబ్రవరి 29: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ తిమ్మారెడ్డి ట్రాక్టర్ యజమానులకు హెచ్చరించారు. గురువారం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి జరిమానా విధిస్తామన్నారు.

కార్డుదారులకు రాగిపిండి పంపిణీ : జేసీ

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 29: జిల్లాలో శుక్రవారం నుంచి కార్డుదారులకు రూ.11లకే కిలో రాగిపిండి పంపిణీ చేస్తామని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశంలో జేసీ మౌర్య మాట్లా డుతూ శుక్రవారం నుంచి కార్డుదారులకు రూ.11 కేజీ రాగి పిండిని ఎండీయూ వాహనం ద్వారా పంపిణీ చేస్తామ న్నారు. మార్కెట్‌లో కేజీ రాగిపిండి ధర దాదాపు రూ.40లు ఉందన్నారు. సివిల్ సప్లయ్ డీఎం షర్మిళ, డీఎస్‌వో కేవీఎస్ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన ఇంతియాజ్



ఇంతియాజ్‌ను అభినందిస్తున్న సీఎం జగన్

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 29: రాష్ట్ర సెర్ప్ సీఈఓ, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. గురువారం విజయవాడ తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, మేయర్ బీవై.రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 29: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి కూలీలకు సూచించారు. గురువారం మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఫారంపండ్స్‌తో నీరు నిల్వ చేసుకుని భూగర్భజలాలు పెరుగు తాయని అన్నారు. ఉపాధి పనులకు వచ్చే వారు వంద రోజులు పూర్తి చేసుకో వాలని ఆయన కోరారు. ఆయన వెంట ఏపీవో కుమర సాయినాథ్, టీఏ మధు, ఈసీఏఎఫ్ఏ షేక్షావలి, ఉపాధి కూలీలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సి.బెళగల్, ఫిబ్రవరి 29: మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అనుపమ గురువారం పరిశీలిం చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశామన్నారు. తహసీల్దార్ వెంట బూత్ లెవల్ అధికారురి జాకీర్, ప్రధానోపాధ్యాయులు స్వామి ఉన్నారు.

'పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం'

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 29: పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ అన్నారు. నగర పాలక సంస్థ, కాలుష్యనియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కార్యాలయం నుంచి ఎస్‌బీఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాలు వరకు నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంపై ర్యాలీ నిర్వహించారు. కాలుష్య నియంత్రణ, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కాలుష్యనియంత్రణ మండలి ఈఈ మునిప్రసాద్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, కార్పొరేషన్ ఈఈ షాకీర్ హుస్సేన్, జూనియర్ సైంటిస్టు గణేష్, డీఈ నరేష్, ఏఈ దినేస్ పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయాధికారి సూచనలు

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 29: వేసవిలో పొలాలను లోతైన దుక్కులు చేసుకోవాలని వ్యవసాయాధికారి రవిప్రకాష్ రైతులకు సూచించారు. మండలంలోని పులకుర్తి గ్రామంలో గురువారం ఆర్బీకేలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. రబీ పంటలు పూర్తిదశకు చేరుకున్న వెంటనే పంట అవశేషాలను గట్లకు చేర్చి కాల్చివేయాలని సూచించారు. పొలాన్ని వాలుకు అడ్డంగా లోతైన దుక్కి చేపడితే.. భూమి లోపల దాగిన పురు గులు, లార్వా నశించిపోతాయని అన్నారు. అలాగే మండలంలో బోరుబా వులు, హంద్రీ పరివాహకంలో వేసవి పంటల సాగు చేపట్టవద్దని సూచించారు.

తాగునీటి సరఫరాపై కమిషనర్ ప్రత్యేక దృష్టి

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 29: రానున్న వేసవిలో నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ ప్రత్యేక దృష్టి సారించారు. సుంకేసుల జలాశయంలో నీటిమట్టం అడు గంటడంతో, నగర ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కునే క్లిష్ట పరిస్థితిని ముందుగానే గుర్తించిన ఆయన నిర్ణయాత్మక ప్రత్యామ్నాయ చర్యలు చేప ట్టారు. గత మూడు రోజులపాటు నిర్విరామంగా 70 కి.మీ మేర కెనాల్‌లోని అడ్డంకులను తొలగింపజేస్తూ, గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) జలాశయం నుంచి మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకునకు నీటి ప్రవాహాన్ని నగర పాలక సంస్థ అధికారులు మళ్లించారు. కాగా జీడీపీ నుంచీ విడుదల చేయిం చిన 30 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి జి. సింగవరం వద్ద నగరపాలక సంస్థ కమిషనర్ గురువారం పూజలు నిర్వహించారు. అనంతరం సుంకేసుల బ్యారేజీ లో జరుగుతున్న ఇన్‌టేక్ వెల్ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక డీఈఈ రవిప్రకాశ్ నాయుడు, ఏఈలు జనార్దన్, ప్రవీణ్, సాంకేతిక విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పదవీ విరమణ



ప్రిన్సిపాల్ దంపతులను సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 29: కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ గురువారం పదవీ విరమణ పొందారు. న్యూలెక్చరర్ గ్యాలరీలో ఏపీజీడీఏ ఆధ్వర్యంలో వైద్యులు డాక్టర్ పి.సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ సేవలు మరువలేమని కొనియాడారు. సన్మాన గ్రహీత డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ 1979లో వైద్య విద్యార్థిగా ప్రారంభించి 44 సంవత్సరాలు వివిధ హోదా ల్లో పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ చిట్టి నరసమ్మ, సాయిసుధీర్, హరిచరణ్, రేణుకా దేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి, ఏపీజీడీఏ కర్నూలు జీజీహెచ్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, విజయ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

● కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మినిస్టీరియల్ సిబ్బంది ఎంతో కీలకమని ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి అన్నారు. పదవీ విరమణ చేసిన జూనియర్ అసిస్టెంట్ మనోరాజ్‌ను గురువారం సాయంత్రం ధన్వంతరీ హాలులో సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఎంవో సన్మానించారు. సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఆఫీసు సూపరింటెండెంట్లు జమాల్, నాగజయంతి, చిరంజీవి పాల్గొన్నారు.

నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా కల్లే చంద్రశేఖర్ శర్మ

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 29: నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా కల్లే చంద్రశేఖర శర్మ, ప్రధాన కార్యదర్శిగా హెచ్‌కే రాజశేఖర్ రావు, కోశాధికారిగా జి.మాధవప్రభు, ఉపాధ్యక్షులుగా కురాడి మురళీధర్ కల్కూర, మాదిరాజు వెంకటరామ మనోహర్, కె.శ్రీధర్ పడిల్లయలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి హెచ్‌కే మనోహర్‌రావు తెలిపారు. గురువారం నగర బ్రాహ్మణ సంఘం (411/2015) ఎన్నికలు నగరంలోని సంకల్‌బాగ్‌లోగల హరిహర క్షేత్రంలో నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ ఎన్నికలో సంఘం సహాయ కార్య దర్శులుగా కేవీ భాస్కర్‌రావు, పి. ఉమేష్, ఆమంచి విశ్వేశ్వర శర్మ, కార్య నిర్వా హక కార్యదర్శులుగా కేజీ ప్రభాకర్‌రావు, కే పద్మనాభరావు, సంబరాజు దుర్గాప్రసాద్, బోయనపల్లి శివరామప్రసాద్, ఈసీ సభ్యులుగా కనకాపురం సోమనాథమూర్తి, సూర్యనారాయణ, కే సంజీవకుమార్, హరిహర నాదం దేవీ ప్రసాద్, పోరికిన రాఘవేంద్ర, హెచ్‌కే నారాయణరావు, మంకాల సుబ్రహ్మణ్యం శాస్త్రి, విశ్వనాథరావు, వి.వరప్రసాద్, శ్రీనాథ్, ఇస్కాల నాగరాజు, పెనుగొండ సుందర రామశర్మ, కరణం గురురాజారావు, సముద్రాల శ్రీధర్, ఎ.దామోదరరావు ఎన్నికైనట్లు తెలిపారు.

● ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగాలని, ఈ ఎన్నిక చెల్లదని నగర బ్రాహ్మణ సంఘాల నాయకుడు సండేల్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఎస్ఆర్ పేటలోని బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులు శ్యామసుందర్‌రావు, చల్లా నాగరాజ శర్మ, రాజశేఖర్‌రావు, చంద్రశేఖర్‌రావు, శ్రీనివాసరాజు, అనూజ్ కుమార్, హెచ్ దేవీప్రసాద్, వై గోవ ర్ధన్, గౌరిపెద్ది శేష, సీఎస్ ప్రసాదరావు పాల్గొన్నా రు. నగర బ్రాహ్మణ సంఘానికి జరిగిన నూతన ఎన్నిక రద్దు చేయాలని, మరలా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గం ఏర్పడాలని వారు డిమాండ్ చేశారు.

ముగిసిన ప్రజాపోరు యాత్ర-2

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 29: వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతి రేకంగా, కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వానికి మద్దతుగా గత వారం రోజు లుగా నగరంలో కొనసాగిన బీజేపీ ప్రజాపోరు యాత్ర-2 గురువారం రాత్రి ముగిసింది. చివరిరోజు పాతనగరంలోని రాంబొట్ల దేవాలయం, సిల్వర్ జూబ్లీ కళాశాల రోడ్డు, సి.క్యాంపు సెంటర్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ బీజేపీ హయాంలో దేశంలో, రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు మాలత, జయశ్రీ యాదవ్, రాజేశ్వరి, శ్రీరాములు యాదవ్, బీజేపీ జిల్లా అధి కార ప్రతినిధి రామాంజినేయులు, జిల్లా కోశాధికారి లోకేశ్వరయ్య, భగత్, చేనేత రాఘవయ్య, మధుగౌడ్, పాల్గొన్నారు.

వైసీపీలో విలువ లేదు

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 29: వైసీపీ పాలనలో నాయకులకు విలువ లేదని, కార్యకర్తలకు ఏ చిన్న పని కూడా చేయలేని పరిస్థితి నెలకొం దని అనుగొండ వైసీపీ నాయకుడు ఎల్ రామక్రిష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సెల్ఫీ వీడియోను రామక్రిష్ణారెడ్డి మీడియాకు విడుదల చేశారు. గ్రా మంలో తాను సచివాలయ కన్వీనర్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. నాలుగు న్నరేళ్లకు పైగా ఎంతో పని చేసిన విలువ లేకుండాపోయిందన్నారు. త్వరలోనే విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న కేజీ గోవిందరెడ్డి

కర్నూలు(ఎడ్యుకేషన్)/ హాస్పిటల్), ఫిబ్రవరి 29: అవయవ దానంపై అవగాహన కల్పించిన విద్యార్థులను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి అభినందించారు. నగరంలోని డాక్టర్స్ కాలనీలో బాష్యం పాఠశాలలో జరిగిన సైన్స్ ఎక్స్‌పోలో అవయవ దానంపై 9వ తరగతి విద్యార్థినులు సోఫియా, లలిత వాసవిలు ప్రజలకు అవగాహన కల్పించారని, అవయవ దానం అంగీకార పత్రాలను పూర్తి చేయించి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశారని పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. అవయవ దానంపై అవగాహన కల్పించిన విద్యార్థులకు డాక్టర్ కేజీ గోవిందరెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

ఘనంగా అల్లీహుసేన్ స్వామి కిస్తీలు



కిస్తీలో పాల్గొన్న భక్తులు

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 29: మండలంలోని వర్కూరులో సద్గురు అల్లీహుసేన్ స్వామి కిస్తీ వేడుకలు గురువారం సాయంత్రం వైభవంగా నిర్వ హించారు. పలువురు మేళతాళాల మధ్య ఎద్దులబండ్లపై ఫలహారం తీసుకవచ్చారు. దర్గా ముందున్న రాతి పాత్రలో ఫలహారం ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పంచిపెట్టారు. కిస్తీలను తిలకించడానికి గ్రామస్థులు తరలివచ్చారు. భక్తులు దర్గాలో పూజలు చేసి పీఠాధిపతి అబ్దుల్ సలాంస్వామి ఆశీస్సులు పొందారు. రాత్రి చిన్నారులచే ఏర్పాటు చేసిన భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది.

ఉద్యోగులకు మధ్యంతర భృతి చెల్లించాలి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 29: ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీలో మధ్యంతర భృతి 30 శాతం తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆదోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం పట్ల తాత్సారం చేస్తోందని విమర్శించారు. తమ అవసరాల కోసం దాచుకున్న సొమ్మును కూడా ప్రభుత్వం వాడేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేసి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురామయ్య, గౌరవ అధ్యక్షుడు తిక్కస్వామి, జిల్లా కార్యదర్శి భీమారెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, లక్ష్మీ నరసింహ, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ఎమ్మిగనూరు రూరల్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కాశిం, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రంగనాథ్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ స్థానంలో ప్రవేశపెట్టాలని చూస్తున్న జీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమానికి పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు సంఘీభావం తెలిపారు. క్వాంటంఆఫ్ పెన్షన్ పాత పద్ధతిలో 10, 15 శాతం ప్రకారం చెల్లించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణయ్యశెట్టి, పరశురాముడు, హేమంత్ కుమార్, రామన్న, రామాంజ నేయులు, వీరభద్ర ఆచారి, సుగుణ కుమార్, బసవరాజు, ఉరుకుందు, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, ముక్కరన్న పాల్గొన్నారు.



కౌతాళం మండలం మరళిలో తుంగభద్ర నదిలో చెలమనీరు తోడుకుంటున్న గ్రామస్థుడు

చెలిమ నీరే దిక్కు

- తుంగభద్ర నదీతీరంలో కన్నీటి ఘోష
- పత్తాలేని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు
- గాలికొదిలేసిన నీటి పథకాలు

కోసిగి, ఫిబ్రవరి 29: తుంగభద్ర నదీ తీర గ్రామాల్లో తాగేందుకు చుక్కనీరు లేక పల్లె ప్రజలు తల్లడిల్లుతున్నారు. నీటి పథకాలు మూలనపడి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆఫీసులకే పరిమితమై పల్లెల వైపు కన్నెత్తి చూడటం లేదు. నియోజకవర్గంలోని కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం మండలాల్లో వేసవికి ముందే తాగునీటి కష్టాలు తీవ్రతరమయ్యాయి. ఈ మండలాల్లో మొత్తం 96 పల్లెలు ఉన్నాయి. నియోజకవర్గ జనాభా 3 లక్షల పైచిలుకు నివాసాలు ఉంటున్నారు. ఈ ఏడాది వర్షాలు లేక నదీతీర గ్రామాల ప్రజలు పొలాలబాట పట్టి తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. కౌతాళం మండల పరిధిలోని హాల్వి ఎస్ఏపీ సీపీడబ్ల్యూ పథకం ద్వారా 12 గ్రామాలకు చెందిన సుమారు 30 వేల మంది జనాభా ఈ నీటితోనే అవసరాలు తీర్చేకునేవారు. నదిలో నీరు ఇంకిపోవడంతో ఇప్పటికే పది గ్రామాలకు నీటి సరఫరా నిలిపివేశారు. తుంగభద్రనదిలో తవ్విన చెలిమ నీరు ద్వారా మరళి, కుంబలూరు, అగసలదిన్నె ప్రజలు దాహార్తిని తీర్చుకుంటున్నారు. కోసిగి మండలం సాతనూరు గ్రామస్తులు రెండు కి.మీల దూరంలోని పక్క గ్రామాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. తుంగభద్ర నదీతీరంలోని అగసనూరు, కామన్‌దొడ్డి, కందుకూరు, కడిదొడ్డి, వందగల్లు, చిన్నభోంపల్లి, కోసిగి తదితర గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. దాదాపు రెండు నెలలుగా సాతనూరు దగ్గరున్న ఎస్ఏపీ స్కీమ్ ద్వారా కోసిగి గ్రామానికి నీరు సరఫరా కావడం లేదు. కాంట్రాక్టరు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పట్టించుకోకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తిందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పెద్దకడుబూరు పరిధిలోని దొడ్డిమేకల, చిన్నకడుబూరు, కంబలదిన్నె, రంగాపురం, పారాపురం, మేకడోన, కల్లుకుంట, రాగిమాన్‌దొడ్డి గ్రామాల్లో తాగునీరు లేదు. మంత్రాలయం మండలంలో సూగూరు, చిలకలడోన, రచ్చుమర్రి, వగరూరు, తిమ్మాపురం గ్రామాల్లో చుక్కనీటి కోసం పరుగులు పెడుతున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

పత్తికొండ, ఫిబ్రవరి 29 : పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం శుక్రవారం పత్తికొండలో ఘనంగా సాగింది. ఉదయం బహ్మ రథాంగహోమం, స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు రథాంగహోమం నిర్వహించిన తర్వాత స్థానిక పెద్దాంజనేయస్వామి దేవాలయం వరకు రథాన్ని లాగారు. సాయంత్రం 6గంటలకు పెద్దాంజనేయస్వామి దేవాలయం నుంచి వడ్డేవారికట్ట అక్కడి నుంచి తిరిగి చెన్నకేశవస్వామి దేవాలయం వరకు రథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. సుమారు కిలోమీటరు దూరం సాగే రథోత్సవం గంటపాటు పురవీధుల్లో సాగింది. రథోత్సవం ప్రశాంతంగా నిర్వహించేందుకు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో పత్తికొండ సీఐ మురళీ మోహన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డితోపాటు ఆస్పరి, దేవనకొండ, ఆలూరు సీఐలు, ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.

కేఈ శ్యాంబాబు ప్రత్యేకపూజలు

రథోత్సవాన్ని పురస్కరించుకొని పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. టీడీపీ కార్యాలయం నుంచి వందలాదిమంది కార్యకర్తలో కేఈ శ్యాంబాబు డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయనికి చేరుకోగా ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు సురేష్‌కుమార్, ఆలయప్రదాన అర్చకులు బ్రహ్మయ్యఆచారి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, తుగ్గలినాగేంద్ర, బత్తిని వెంకటరాముడులకు ఆలయ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు.



జనం మధ్య రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తిక్కారెడ్డికే సీటు దక్కుతుంది : టీడీపీ



మాట్లాడుతూన్న టీడీపీ రైతు సంఘం నాయకుడు రమాకాంత్ రెడ్డి

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 29: గత 10 ఏళ్ల నుండి టీడీపీ కోసం కష్టపడ్డ నియోజక వర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డికే సీటు దక్కుతుందని టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని టీడీపీ మండల అధ్యక్షుడు బసలదొడ్డి ఈరన్న అధ్యక్షతన అన్ని గ్రామాల టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయంలో వైసీపీ అరాచాకాలు, దౌర్జన్యాలను ఎదుర్కొనే శక్తి కేవలం తిక్కారెడ్డికే ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు మల్లికార్జున, దశరథరాముడు, ఏసేబు, వీరేష్ గౌడ్, ప్రతాప్‌రెడ్డి, హనుమాపురం పెద్దయ్య, ఈరన్న, మీసేవ ఆంజినేయులు, సత్యన్నగౌడ్, మురళి కృష్ణ, అయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

వైభవంగా తిమ్మప్ప స్వామి రథోత్సవం

మద్దికెర, ఫిబ్రవరి 29: ఎడవలి గ్రామంలో తిమ్మప్పస్వామి, ఎడవల్లప్పస్వామి, ఘడేదూలప్పస్వామి రథోత్సవం గురువారం వైభవంగా సాగింది. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం రథం ముందు హోమాన్ని నిర్వహించారు. అనంతరం అశేష జనవాహిని మధ్య రథం ముందు ఉత్సవమూర్తులను పెట్టి రథాన్ని ముందుకు లాగారు. భక్తులు రథంపైన అరటిపండ్లు విసిరి తమ భక్తిని చాటుకున్నారు. రాత్రి వేడుకల్లో సందర్భంగా భజన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వవిధ గ్రామాల నుంచిభక్తులు పాల్గొన్నారు.



రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 29: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం వాయిదా పడింది. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో కౌన్సిల్ సాధరణ సమావేశం చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన నిర్వహించారు. కౌన్సిల్ సమావేశానికి 12మంది సభ్యులకు మించి హాజరు కాలేదు. దీంతో కోరం లేకపోవటంతో సమావేశాన్ని మార్చి 5వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ రఘు తెలిపారు. పెళ్లిలు అధికంగా ఉండటంతో సభ్యులు సమావేశానికి పూర్తి స్థాయిలో హాజరు కాలేదని చైర్మన్ పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్, కమిషనర్ గంగిరెడ్డి, సిబ్బంది, టీడీపీ ఫ్లోర్‌లీడర్ దయాసాగర్, కౌన్సిలర్ రామదాసుగౌడ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. 24వ వార్డులో సీసీ రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ వార్డు కౌన్సిలర్, చైర్మన్ తల్లి సరోజమ్మ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

'నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి'

గోనెగండ్ల , ఫిబ్రవరి 29: ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఎస్ ఈరన్న అన్నారు. గురువారం మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు ప్రాంతంలో ప్రజాపోరు రెండో దఫా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.

కల్వర్టు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి



సోమప్ప సర్కిల్‌లో కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 29: పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ప్రధాన వరద కాలువపై నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం కల్వర్టు నిర్మాణపనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయని, కల్వర్టును పూర్తి చేస్తే సోమప్ప సర్కిల్ మరింత వెడల్పు అవుతుందని దీంతో ట్రాఫిక్ సమస్యలు తీరుతాయన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

వెలవెలబోయిన కౌన్సిల్ సమావేశం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 29: కౌన్సిల్ సాధారణ సమావేశానికి కొద్దిమంది సభ్యులు మాత్రమే హాజరు కావడంతో ఖాళీ కుర్చీలతో వెలవెలబోయింది. గురువారం మునిసిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత అధ్యక్షతన జరిగిన సమావేశంలో 42 మంది కౌన్సిల్ సభ్యులకుగాను 20 మంది మాత్రమే హాజరయ్యారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో కుక్కల బెడద అధికంగా ఉండటంతో పిల్లలు ప్రమాదాలకు గురౌతున్నారని, వాటిని పట్టణ పొలిమేరలకు తరలించాలని చాలాకాలంగా కోరుతున్నా, అధికారులు ఎందుకు స్పందించడం లేదని వైస్ చైర్మన్ ముల్లా గౌస్, కౌన్సిలర్లు ఇస్మాయిల్, రఘు ప్రశ్నించారు. కుక్కలను అడవులలో వదిలిపెట్టడానికి అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వనందుకు వాటి సంఖ్య పెరుగకుండా వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలను నిర్వహిస్తారని కమిషనర్ ఇన్‌చార్జి డాక్టర్ అనుపమ సభ్యులకు తెలిపారు. కౌన్సిలర్ బాలాజీ యాదవ్, రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ హొస్పేటలోని తుంగభద్ర డ్యాములో నీటి నిలువ తక్కువ ఉండటంతో లోలెవెల్‌కు తాగునీటి విడుదలలో ఆలస్యం జరిగే అవకాశం ఉందని, జూలై నెలలో పట్టణంలో తాగునీటి సమస్యలు ఎదురు కాకుండా కౌన్సిల్ సభ్యులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి చర్చించాలని కోరారు. సమావేశంలో సాధారణ అజెండాలోని 24 అంశాలను, టేబుల్ అజెండాలోని 6 అంశాలను సభ్యులు ఆమోదించారు. రెవెన్యూ ఆఫీసర్ అస్లంబాషా, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎంఈ చలపతి, ఏఈ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో ఖాళీ కుర్చీలు

టీడీపీని గెలిపించండి



మైనార్టీ కాలనీలో ప్రచారం చేస్తున్న మాచాని సోమనాథ్

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి 29: రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి, నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలని మాచాని సోమనాథ్ కోరారు. గురువారం పట్టణంలోని మైనార్టీ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ టీడీపీ సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు. సాయంత్రం పట్టణంలో టీడీపీని గెలిపించాలంటూ సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని దాన్ని ప్రజలు తరిమికొట్టాలన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పత్తి ధర క్వింటా రూ.7,849

- వారంలో రూ.400లకు పైగా పెరిగిన ధర

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 29: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తిధరలు పెరుగుతున్నాయి. గురువారం క్వింటాలు పత్తిధర రూ.7,849 పలికింది. గతవారంతో పోల్చితే క్వింటాకి రూ.400కు పైగా పలికింది. ఇప్పటికే 90 శాతం మంది రైతులు పత్తిని విక్రయించుకున్నారు. మార్కెట్లో విక్రయానికి పత్తి రాకపోవడంతో పత్తి పరిశ్రమల్లో ఉత్పత్తికి కావలసినంత ముడిసరుకు లభించడం లేదు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ పెరిగి పత్తి జిన్నింగ్ ప్రెస్సింగ్ పరిశ్రమల్లో ఉత్పత్తికి అవసరమైన పత్తిని పోటాపోటీగా ధరలు వేసి కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారుల మధ్య పోటీ వల్ల ధరలు పెరగడానికి కారణమైందని అధికారులు తెలిపారు. 678 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా, వాటి కనిష్ట ధర క్వింటాలు రూ.5,467, గరిష్ట ధర రూ.7,411, మధ్యస్థ ధర రూ.7,849 పలికింది.



ఆదోని మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన పత్తి

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 29: ఇంటర్మీడియెట్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు సంబంధించి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే ప్రశ్నాపత్రాలు సంబంధిత పోలీస్ స్టేషన్‌లకు చేరుకున్నాయి. ఆదోని పట్టణంలో ఆర్ట్స్ కళాశాలలో రెండు కేంద్రాలు, ప్రభుత్వ బాలికల కళాశాల, సాయి జూనియర్ కళాశాల, బాలాజి జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, అక్షరశ్రీ జూనియర్ కళాశాలలో పరీక్షలు జరగనున్నాయి. దాదాపుగా 4వేల మంది ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలి

తుగ్గలి, ఫిబ్రవరి 29: తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని తెలుగు రైతు తాలుకా ఉపాధ్యక్షుడు బాలన్న, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణస్వామి యాదవ్, రవి యాదవ్ కోరారు. గురువారం మండల పరిధిలోని జొన్నగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో సాగు చేసిన పంటలు ఎండిపోయి నష్టాలు మిగిల్చాయని, ఈ ఏడాది పెట్టుబడులు కూడా దక్కక రైతులు పట్టణాలకు వలస వెళ్తున్నారని పేర్కొన్నారు.

ఆశాలను ఎంప్లాయిస్‌గా గుర్తించాలి

వెల్దుర్తి, ఫిబ్రవరి 29 : ఏపీ ఆశా వర్కర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు అన్నారు. గురువారం వెల్దుర్తిలో సీఐటీయూ కార్యాలయంలో మండలంలో ఉన్న ఆశా వర్కర్ల కార్యకర్తలతో సీనియర్ నాయకురాలు లలితమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్లతో జరిపిన చర్చలను జీవో రూపంలో మినిస్ట్రీ రూపంలో తీసుకొని రావాలని మిన్నయిన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వలస కూలీ కష్టం.. జేబు దొంగలపాలు

కోసిగి, ఫిబ్రవరి 29: పిల్లాపాపలతో వలస వెళ్లి సొంతూరిలో జాతర చూసుకొని తిరిగి బయలుదేరుతున్న ఓ వలస కూలీ కూలి కష్టం రూ. 50వేలు దొంగల పాలయ్యింది. కోసిగిలోని 3వ వార్డు వాల్మీకినగర్‌కు చెందిన పోతుల నాగిరెడ్డి వలస కూలీ. కాయకష్టం చేసి రూ.50వేలు తన జేబులో ఉంచుకున్నాడు. రేణుకా ఎల్లమ్మ జాతర సందర్భంగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని తిరిగి వెళ్తున్న సమయంలో ఓ మహిళ నుదిటి మీద బొట్టు పెట్టడంతో కొద్దిసేపటికే జేబులు కత్తిరించి దొంగలు రూ.50వేల నగదు అపహరించారని నాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తన జేబును బ్లేడుతో కట్ చేసి డబ్బు దొంగతనం చేశారని కోసిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఫిబ్రవరి 29 : మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన మాఘ గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు తీసుకోండి

ఆదోని, ఫిబ్రవరి 29: వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి, ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గత మాసంలో జరిగిన రోడ్ సేఫ్టీ సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలలో భాగంగా ఎమ్మిగనూరు బైపాస్ సమీపంలో నెట్టకల్ క్రాస్ వద్ద రంబుల్ స్ట్రిప్స్, ఎమ్మిగనూరు పట్టణం నందవరం వై జంక్షన్ దగ్గర లైటింగ్, మార్కెట్ సమీపంలో స్పీడ్ బ్రేకర్స్ వేసినట్లు పేర్కొన్నారు.

'బీవీని గెలిపించడమే లక్ష్యం'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందవరం, పిబ్రవరి 28: ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా బీవీ జయనాగేశ్వరరెడ్డిని గెలిపించుకోవడమే తమ ఎదుట ఉన్న లక్ష్యమని టీడీపీ నాయకులు మాచాపురం కాశీంవలి, గురురాజారావు, ధర్మాపురం గోపాల్, మాజీ ఎంపీటీసీలు తిమ్మరాజు, జగ్గాపురం నరసింహులు అన్నారు. గురువారం నందవరం పార్టీ కార్యాలయం దగ్గర నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు టికెట్ మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి బీవీ కుటుంబం పార్టీకి, కార్యకర్తలకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ కుమారుడు రషీద్, మైనార్టీ నాయకులు షరీష్, డబ్బా ఈరన్న, తెలుగు ఈరన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

లక్ష్యం నిర్దేశించుకుని విజయం సాధించాలి

విద్యార్థులతో ఆర్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ గోపీనాథ్ తులసి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 29: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పరుచుకున్నప్పుడే విజయాన్ని అందుకుంటారని ముంబైకి చెందిన ఆర్‌బీఐ చీఫ్ జెనరల్ మేనేజర్ గోపీనాథ్ తులసి అన్నారు. గురువారం ఆదోని ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు ఉద్యోగాలకు కావాల్సిన నేర్పరితనం అనే అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ గమ్యంలేని చదువులు వ్యర్థమని అన్నారు. గమ్యాన్ని ఏర్పరుచుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులను ఉపాధ్యాయులను గౌరవించినప్పుడే జీవితంలో రాణిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. అనంతరం గోపీనాథ్ తులసీని అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీమోహన్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు యుగంధర్ రెడ్డి, రామకృష్ణ, జొనాథన్, రజాక్ పాల్గొన్నార



గోపీనాథ్ తులసిని సన్మానిస్తున్న అధ్యాపకులు